

బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయా డివిజన్ల మహిళలతో మంత్రి గంగుల కమలాకర్



బీఆర్‌ఎస్‌లో చేరిన అనంతరం మంత్రి గంగులతో కలిసి నినాదాలు చేస్తున్న యువకులు

# బీఆర్‌ఎస్‌లో చేరికల జోష్

- పార్టీలో చేరిన కరీంనగర్ నియోజకవర్గంలోని పలువురు మహిళలు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు
- గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నవంబర్ 5: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన, డివిజన్లకు చెందిన యువకులు, మహిళలు ఆదివారం స్థానిక మంత్రి నివాసంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి మంత్రి గంగుల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ నాయకుడు నక్క కృష్ణ ఆధ్వర్యంలో నగరంలోని పలువురు యువకులు, కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, బీఆర్‌ఎస్ నాయకుడు మంథని కిరణ్ ఆధ్వర్యంలో పలువురు



యువకుడికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

మహిళలు మంత్రి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రజలు ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కరీంనగర్ రూరల్ మండలాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, కాసారపు శ్రీనివాస్‌గౌడ్, అంజిరెడ్డి, గంగాధర లక్ష్మయ్య, గంగాధర చందు, వొల్లాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్‌బోర్డు కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దాం

- త్వరలో 24 గంటల మంచినీటి సౌకర్యం కల్పిస్తాం
- బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌ను ఆశీర్వదించి గెలిపించాలి
- మేయర్ యాదగిరి సునీల్‌రావు



హౌసింగ్‌బోర్డు కాలనీ వాసులతో మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, నవంబర్ 5: కరీంనగర్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీని అన్ని రంగాల్లో అద్భుతంగా తీర్చిదిద్దామని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు కోరారు. స్థానిక 6వ డివిజన్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆదివారం ఉదయం ఆయన వాకర్స్, మహిళలను కలిసి ప్రచారం చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే కరీంనగర్ నగర రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని అన్నారు. గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ పాలనలో నగరానికి సీఎం కేసీఆర్ వేల కోట్ల నిధులు కేటాయించి నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేశారని తెలిపారు. మంత్రి గంగుల కమలాకర్ నగర అభివృద్ధే ధ్యేయంగా నిత్యం ప్రజల మధ్యే ఉంటూ సమస్యలను పరిష్కరించారని చెప్పారు. గతంలో హౌసింగ్‌బోర్డుకాలనీకి రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఉండేదని, మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యేక చొరవతో ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. హౌసింగ్‌బోర్డుకాలనీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ. 65 కోట్లు ఖర్చు చేసి చక్కటి డ్రైనేజీలు, రోడ్లు నిర్మించి, పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించామన్నారు. మార్నింగ్ వాకింగ్ చేసుకోవడానికి ప్రజలకు ప్రత్యేక వాకింగ్ ట్రాక్‌లు, అందమైన పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. మహిళల విజ్ఞప్తి మేరకు త్వరలోనే మరో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో త్వరలోనే 24 గంటల మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పించిన బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆదరించాలని పిలుపునిచ్చారు. కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి గంగుల కమలాకర్‌ను నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించి సీఎం కేసీఆర్ చేతులు బలోపేతం చేయాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ఓటు వేస్తే భావితరాల మన బిడ్డల భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. కేసీఆర్ నాయకత్వం ఉంటేనే తెలంగాణ రాష్ట్రం సురక్షితంగా ఉంటుందని తెలిపారు. కాలనీ వాకర్స్, మహిళలు పాల్గొన్నారు.

# బీపీ, షుగర్ అదుపులో ఉంచుకోవాలి

- ఐఎంఏ, ఎస్సారార్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో హెల్త్ టాక్ కార్యక్రమం

విద్యానగర్, నవంబర్ 5: 30 ఏళ్లు దాటిన వారు బీపీ, షుగర్ అదుపులో ఉంచుకోవాలని కరీంనగర్ మెడికవర్ దవాఖాన వైద్యులు సూచించారు. నగరంలోని ఎస్సారార్ కళాశాలలో ఐఎంఏ, ఎస్సారార్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్ కోసం ఏర్పాటు చేసిన హెల్త్ టాక్ కార్యక్రమానికి దవాఖాన వైద్యులు కిరణ్‌కుమార్ కొండపాక, కొండ చైతన్య హాజరయ్యారు. పలువురు వాకర్స్ అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ప్రస్తుతం గుండె జబ్బు రావడం సర్వసాధారణమైందని, ఈ పరిస్థితుల్లో వ్యాయామం, డైటింగ్ పై దృష్టి పెట్టాలని సూచించారు. బీపీ, షుగర్‌తో హార్ట్ ఎటాక్, కిడ్నీ ఫెయిల్యూర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయన్నారు. నిద్రలేమి, ఒత్తిడితో బాధపడేవారు, ఫ్యామిలీ హిస్టరీ ఉన్న వారు రెగ్యులర్ స్క్రీనింగ్ చేసుకోవడం మేలన్నారు. చిన్న వయసులో హార్ట్ ఎటాక్ రావడానికి ఆహారపు అలవాట్లు, ఒత్తిడే కారణమన్నారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాంకిరణ్ మాట్లాడుతూ, ప్రతి నెలా మొదటి ఆదివారం ఎస్సారార్ కళాశాలలో నిర్వహించే ఆరోగ్య అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ దవాఖాన సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, సూపరింటెండెంట్ డాక్టర్ రవిమల్లారెడ్డి, మార్కెటింగ్ హెడ్ కరుణాకర్, హర్షిత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వైద్యుడు కిరణ్‌కుమార్ కొండపాక

## రేపు నాయీబ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం

తెలంగాణచౌక్, నవంబర్ 5: నగరంలోని పద్మనాయక కల్యాణ మండపం (మినీ)లో ఈనెల 7న తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య తెలిపారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథులుగా సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మోహన్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు హాజరవుతారని తెలిపారు. సంఘం సభ్యులు కుటుంబ సభ్యులతో హాజరై ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాం, నగర అధ్యక్షుడు జంపాల సంపత్ పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు తరలిన కార్పెంటర్స్ అసోసియేషన్ సభ్యులు



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న కార్పెంటర్స్ అసోసియేషన్ సభ్యులు

కలెక్టరేట్, నవంబర్ 5: హైదరాబాద్‌లోని ఉప్పల్ బాగాయత్‌లో ఆదివారం నిర్వహించిన కార్పెంటర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనానికి నగరం నుంచి సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఉప్పల్ బాగాయత్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన సంఘ భవనం ప్రారంభోత్సవం, అనంతరం బహిరంగ సభ ఉంటుందని సంఘం ప్రతినిధి శ్రీరామోజు రవీంద్రాచారి తెలిపారు. తరలివెళ్లిన వారిలో సంఘం నాయకులు కలికోట సత్యనారాయణ, గుండోజు లక్ష్మయ్య, వేములవాడ ద్రోణాచారి, తిప్పారపు శ్రీనివాస్, గొట్టెముక్కల ఉమారాణి-వెంకటరమణ, కడార్ల శివప్రసాద్, కట్ట జగన్, రావుల శ్రీకాంత్, గద్దె సత్యనారాయణ, ఊకంటి ఓంకార్, శికల్ల హరిహరాచారి, వంగల శ్రీధర్, కొత్తపల్లి బ్రహ్మాచారి, ఉదారపు మారుతి, పూసాల రాధాకిషన్, పోలోజు నర్సింహాచారి, ముత్తోజు ప్రభాకర్, కాయితోజు పవన్‌కుమార్, నాగసముద్రం శ్రీనివాస్, కళికోట మోహన్, వెగ్గళం రామకృష్ణ, తదితరులున్నారు.

## 'స్పేస్'లో కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ, ఉపాధి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 5: నగరంలోని స్పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌లో సంకల్ప్ ఉద్యోగ, ఉపాధి శిక్షణ పథకం 2023లో భాగంగా సుమారు 200 మంది అభ్యర్థులకు డీసీఏ, పీజీడీసీఏ, ఎంఎస్ ఆఫీస్, టాలీ ప్రైమ్, ఫొటోషాప్, జావా, పైథాన్, ఆడియో, వీడియో ఎడిటింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ వేణు జంజిరాల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు రూ. 8 వేల నుంచి రూ. 20 వేల వేతనంతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి ఆపైన చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 6,7వ తేదీల్లో స్పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ (సీపీ బిల్డింగ్ సమీపం)లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరై అడ్మిషన్ పొందాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్ 90301 24777లో సంప్రదించాలని కోరారు.

## అలరించిన జాతీయ స్థాయి కవి సమ్మేళనం

కమాన్‌చౌరస్తా, నవంబరు 5: జిల్లా కేంద్రంలోని ఫిలింభవన్‌లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భవానీ సాహిత్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కవి సమ్మేళనం అలరించింది. ఈ కార్యక్రమానికి భాషా సాంస్కృతిక మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గంట జలేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కవులు, రచయితల పాత్ర గురించి వివరించారు. వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన పద్య కథా సౌరభం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఇక్కడ ట్యాగ్ లైన్ కింగ్ డాక్టర్ ఆలపాటి, కంద సార్వభౌమ డాక్టర్ రాధశ్రీ, తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కార గ్రహీత మల్లారెడ్డి, తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన సుమారు 100 మంది కవులు, రచయితలు తమ కవితలను వినిపించారు. వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దాస్యం సేనాధిపతి, నరసింహారావు పాల్గొన్నారు.



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు